పేదల సంక్షేమమే ధ్యేయం

వెంకట్రావుపేటలో బాధిత కుటుంబాలకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి

తొగుట, అక్టోబర్ 8: పేదల సంక్షేమమే ధ్యేయంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో జంగపల్లి నాగమణి, రేపాక స్వప్న, సుతారి రజిత, రేపాక స్వాతిలకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా ఉన్న సమయంలో దుబ్బాక నియెజకవర్గ అభివృద్ధి కోసం కొత్త ప్రభాకర్‌రెడ్డి అహర్నిశలు కృషి చేశారన్నారు. నేడు ఎమ్మెల్యేగా పేదల కోసం పాటు పాడుతున్నారని గుర్తుచేశారు.సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దసరా పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు పిట్ల వెంకటయ్య, జీడిపల్లి గోవర్ధన్‌రెడ్డి,బండారు స్వామిగౌడ్,పాత్కుల స్వా మి, ఈదుగాళ్ల పరశురాములు, పాత్కుల బాలేశ్, పిట్ల వెంకటేశ్, కుర్మ లింగం, పులిగారి మహ్మద్ జహంగీర్, రాములు,అభియాదవ్,మిద్దె సురేశ్,జూపల్లి జహంగీర్, వెంకటయ్య, కిష్టయ్య, శంకర్, నాగయ్య,బాలరాజు పాల్గొన్నారు.

'బతుకమ్మ-దసరా సంబురాల్లో చేర్యాల విద్యార్థులు

గాయకుడు రామ్‌మిరియాలకు నకాషీ చిత్రపటాన్ని అందజేస్తున్న గణపతి, షర్మద

చేర్యాల, అక్టోబర్ 8 : అమెరికాలోని డల్లాస్‌లో తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన 'బతుకమ్మ-దసరా సంబురాలు' ఘనంగా జరిగాయి. తెలంగాణ పీపుల్స్ అసోసియేషన్ ఆఫ్ డల్లాస్(టీపీఏడీ)లో గోలి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలల్లో ప్రఖ్యాత చౌరస్తా బ్యాండ్‌ను ఆహ్వానించి సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.వేలాది మంది పాల్గొన్న కార్యక్రమంలోరారామ్ మిరియాలతో పాటు వేదిక పై పాటలు పాడే అవకాశాన్ని చేర్యాల పట్టణానికి చెందిన కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ కుమార్తె గుళ్లపల్లి శ్రీగణపతి(గన్ను)కు లభించింది. ఈ సందర్భంగా వేదిక మీద పాటలు పాడి అందరి మన్ననలు గన్నుతో పాటు సోదరి గుళ్లపల్లి షర్మద పొందారు.ప్రముఖ గాయకుడు రామ్ మిరియాలను చేర్యాల నకాషీ చిత్రపటాన్ని అందించి ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంతో చేర్యాలకు చెందిన శ్రీగణపతి,షర్మదతో పాటు నకాషీ చిత్రకళ విశ్వవ్యాప్తమయ్యారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

చిట్యాలలో జెండావిష్కరిస్తున్న శశిధర్

చేర్యాల, అక్టోబర్ 8 : ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. మండలంలోని చిట్యాలలో మంగళవారం జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. కిలో నూనె ప్యాకెట్ ధర రూ.40 పెరిగిందని, పప్పులు, ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపు కావడంతో పేదల జీవితం అస్తవ్యస్తంగా మారిందన్నారు.గ్రామాల్లో ఇండ్లు లేని వారికి వెంటనే ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని, రేషన్‌కార్డులతో పాటు ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు.60 ఏండ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.అనంతరం గ్రామ కమిటీల అధ్యక్షులుగా మల్కనీ ఎల్లయ్య, బొడిగం చంద్రారెడ్డి, సోషల్ మీడియా బాధ్యుడిగా మహేందర్‌ను ఎన్నుకున్నారు.సమావేశంలో మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, నాయకులు చొప్పరి రవికుమార్, బోయిన మల్లేశం, సూర్న తిరుపతి, సాంబయ్య, ఎల్లయ్య, సిద్ధులు, రమేశ్, రాములు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో పూర్తైన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

హుస్నాబాద్‌లోని 11వవార్డులో సర్వే చేస్తున్న అధికారులు

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 8: హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డులో నిర్వహించిన ఫ్యామిలీ డిజిటల్‌కార్డు సర్వే పూర్తిచేసినట్లు మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో నాలుగు బృందాలుగా ఫ్యామిలీ డిజిటల్‌కార్డు సర్వే నిర్వహించినట్లు వివరించారు. 11వవార్డులో 327 కుటుంబాలకు చెందిన సమాచారాన్ని సేకరించి సర్వే పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

వికాస పిల్లలకు కొత్తబట్టలు అందజేస్తున్న రామచంద్రం

జగదేవపూర్, అక్టోబర్ 8: వికాస పిల్లలను అక్కున చేర్చుకొని నిలుస్తున్న ఎస్‌సీవీ రోస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మాజీ జడ్పీటీసీ రామచంద్రం అన్నారు. మండలంలోని అలిరాజ్‌పేటలో వికాస పిల్లలకు దసరా పండుగను పురస్కరించుకొని కొత్తబట్టలు, అనాథ వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు 17 ఏండ్లుగా ప్రతి సంవత్సరం వికాస పిల్లలకు కొత్త బట్టలు అందించడం సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, రోస్ సంస్థ డైరెక్టర్ సవిత, క్యాథలిన్, కోఆర్డినేటర్ శ్వేత, సావతి, నర్సింహులు, సలీం తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలోని దాబాల్లో సీఐ తనిఖీలు

యువకులతో మాట్లాడుతున్న సిద్దిపేట సీఐ ఉపేందర్

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 8 : దాబాల్లో మద్యం తాగడానికి..అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ యజమానులను హెచ్చరించారు.సర్కిల్ పరిధిలోని దాబాల్లోకొందరు న్యూసెన్స్ చేస్తున్నారని నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు.ఈ మేరకు సిబ్బందితో వెళ్లి న్యూసెన్స్ చేస్తున్న తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశారు.అనంతరం టూటౌన్ పరిధిలోని అన్ని దాబాలను సీఐ ఉపేందర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.

యువత సన్మార్గంలో నడవాలి

యువత సన్మార్గంలో నడిచి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ ఆకాంక్షించారు.పట్టణంలో కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మంగళవారం కమ్యునిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి: సీపీఎం

కొమురవెల్లి, అక్టోబర్ 8 : ఎసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిముచ్చాలలో బొడిగం వరలక్ష్మి, చుంచు దేవకుమార్, సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాసభ సూచకంగా సీనియర్ నాయకుడు నక్కల యాదవరెడ్డితో జెండాను ఆవిష్కరింజేశారు. సురేందర్‌రెడ్డి, బాలనర్సయ్య, బి.కృష్ణారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు

క్రీడాకారులకు చక్కని వేదిక సీఎం కప్

కలెక్టర్ మను చౌదరి

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట,అక్టోబర్ 8: పల్లెల నుంచి ప్రపంచ స్థాయి వరకు ఎదిగేందుకు సీఎం కప్ క్రీడలు దోహదం చేస్తాయని కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం టార్చ్ ర్యాలీ సిరిసిల్ల నుంచి సిద్దిపేటకు వచ్చిన సందర్భంగా సిద్దిపేట పెద్దమ్మ దేవాలయం వద్ద ముఖ్యమంత్రి కప్ టార్చ్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లెల్లో దాగిఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలితీయడమే లక్ష్యంగాక్రీడలు జరుగుతున్నాయన్నారు. డీవైఎస్‌వో జయదేవ్ ఆర్యా, అధికారి వెంకటేశ్‌గౌడ్ తది తరులు పాల్గొన్నారు.

వర్గల్: వర్గల్ సరస్వతీమాతను దర్శించుకున్న భక్తులు

గజ్వేల్: రిమ్మనగూడలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దుబ్బాక : రామక్కపేటలో పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా శరన్నవరరాత్రి ఉత్సవాలు

గజ్వేల్: సంతోషిమాత దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి దంపతులు

కొండపాక(కుకునూరుపల్లి): లక్ష పుష్పార్చన చేస్తున్న మహిళలు

హుస్నాబాద్‌టౌన్: నళ్లరాళ్లవాడలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పలు వాహనాలు ఢీ

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 8 : అతివేగంతో డీసీఎం డ్రైవర్ అజాగ్రత్తగా డపడం వల్ల పలు వాహనాలు ఒకదానికి ఒకటి ఢీ కొన్న సంఘటన కుకునూరుపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైతు బంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య మంగళవారం ఉదయం స్వగ్రామం బందారం నుంచి కుకునూరుపల్లికి స్నేహితుడితో కలిసి కారులో బయలుదేరాడు. తిమ్మారెడ్డిపల్లి గ్రామశివారులో వెనుకాల నుంచి అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టడంతో కారు రోడ్డు కింద ఉన్న చెట్లపొదల్లోని గుంతలో పడింది. ఆ డీసీఎంను డ్రైవర్ రోడ్డుపై ఉంచడంతో వెనుకాల వస్తున్న ఆర్టీసీ బస్సు డీసీఎంను ఢీ కొట్టగా దాని వెనుకాల వస్తున్న మరోకారు ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటనలో వాహనాలు కొద్దిగా ధ్వంసం కావడంతో పాటు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

చేర్యాల, అక్టోబర్ 8 : మండలంలోని నాగపురి గ్రామానికి చెందిన రిటైర్డు పట్వారి గొట్టం నరసింహారెడ్డి సతీమణి సుగుణ(70) అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు.మండల అధ్యక్షుడు కొమ్ము రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజ మల్లేశం, నల్లపోచమ్మ ఆలయ చైర్మన్ గూడెపు మహేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పుర్మ ఆగం రెడ్డి, నాయకులు నాని, సంతోష్‌రెడ్డి, దొంగల లింగారెడ్డి, గణేశ్‌తివారీ, బండి శ్రీనివాస్, చిరుమల్ల నర్సింహులు, బాబు పాల్గొన్నారు.

గౌరాయపల్లిలో..

కొమురవెల్లి, అక్టోబర్ 8 : మండలంలోని గౌరాయపల్లికి చెందిన కల్లుగీత కార్మికుడు శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పరామర్శించడంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు.

బతుకమ్మ పండుగ ఏర్పాట్ల పరిశీలన

దుబ్బాక, అక్టోబర్ 8: దుబ్బాక పట్టణంలో బతుకమ్మ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకునేందుకు దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, కమిషనర్ రమేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం పట్టణంలోని పెద్ద చెరువుకట్ట వద్ద ఏర్పాట్లను వారు పరిశీలించారు. బతుకమ్మ నిమజ్జనంలో మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. పండుగ సందర్భంగా రూ.15 లక్షలతో మున్సిపల్‌లోని దుబ్బాక, లచ్చపేట, చేర్వాపూర్, ధర్మాజపేట, దుంపలపల్లి, చెల్లాపూర్, మల్లాయిపల్లి వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు చెరువు కట్టల వద్ద మెట్లకు రంగులు, చెరువుకు ఇరువైపులా వీధిదీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన విద్యార్థులు

రాష్ట్రపతి నిలయానికి తరలివెళ్లిన విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 8 : భారతీయ కళామహోత్సవంలో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్ర పతినిలయాన్ని మంగళవారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత , అధ్యాపకులు శ్రద్ధానందం, రాణి,కృష్ణయ్య, బాలకిషన్,మహేందర్, సువర్ణదేవి,వెంకటేశ్వర్లు,జ్యోతి పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 8 : అంతర పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తున్నదని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మిట్టపల్లిలో కంది, రాగి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అంతర పంటలను సాగు చేయడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో ఒక పంట నష్టపోయినా మరో పంట దిగుబడితో నష్టాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. వరి పంట పొలాలను పరిశీలించి తెగులు నివారణకు సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

పంచాయతీ సిబ్బందికి దుస్తులు అందజేస్తున్న ఎంపీడీవో, ఏఎంసీ చైర్మన్

బెజ్జంకి, అక్టోబర్ 8: బెజ్జంకి గ్రామపంచాయతీ సిబ్బందికి గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ దుస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయ డెయిరీ చైర్మన్‌గా రాజు

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 8 : కొండపాక మండలం బందారంలో మంగళవారం పాడిరైతుల సమావేశంలో విజయడెయిరీ చైర్మన్‌గా బట్ట రాజును, వైస్ చైర్మన్‌గా గంగుల వెంకటేశ్వర్లు, డైరెక్టర్లుగా నర్ర నర్సింహారెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, కోమలత, తిరుపత్య, నీల బ్రహ్మం, జాల మల్లయ్య, శేఖర్, వెంకట్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీహెచ్‌సీ ఎదుట ఆశ కార్యకర్తల నిరసన

బెజ్జంకిలోని పీహెచ్‌సీ ఎదుట బతుకమ్మతో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

బెజ్జంకి, అక్టోబర్ 8:ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట బతుకమ్మలతో ఆశ కార్యకర్తలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ కార్యకర్తకు నెలకు రూ.18000 జీతం ఇ వ్వాలని, ఉద్యోగ భద్రత, రోడ్డు ప్రమాదం, సహజంగా మరణించిన వారికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అర్హత కలిగిన వారికి ప్రమోషన్, పెండింగ్ ఇన్సెంటీవ్స్, కొత్త వారిని నియామకం చేపట్టాలన్నారు.

కుమ్మరులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 8 : కుమ్మరుల్లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం పిలుపునిచ్చారు. సిద్దిపేటలో కుమ్మరి ప్రజా ప్రతినిధుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమానిక ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుమ్మరుల ఎదుగుదలకు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణంగా సహకరించాలని కోరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మరులకు టికెట్లు కేటాయించాలని.. అలాంటి పార్టీలకే కుమ్మరుల మద్దతు ఉంటుందన్నారు. కార్పొరేషన్ తక్షణమే ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మర కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. నేతలు సత్యం, ఆంజనేయులు, నాగరాజు, పరశురాములు, నగేశ్, శ్రీనివాస్, సుదర్శన్, మహేందర్, బాలరాజు, సత్తయ్య, భాను, రాములు, భానుచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళా సిబ్బంది

కొమురవెల్లి: తపాస్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పీఆర్టీయూ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు

ఉడేం వేమారెడ్డి

ఎల్లమ్మ

గజ్వేల్, అక్టోబర్ 8: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా గజ్వేల్‌కు చెందిన ఉడేం వేమారెడ్డిని రాష్ట్ర అధ్యక్ష్య ,ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి నియమించినట్లు బుధవారం ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 ఏండ్లుగా పీఆర్టీయూ సంఘం బలోపేతానికి చేసిన కృషికి తనను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించినందుకు, కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

చేర్యాలకు ప్రాధాన్యం

చేర్యాల, అక్టోబర్ 8 : పీఆర్టీయూ టీఎస్ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో చేర్యాల మండలానికి చెందిన ఉపాధ్యాయులకు రాష్ట్ర నాయకత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలిగా కె.ఎల్లమ్మ(వీరన్నపేట),ఏశ్రీనివాస్ రావు(అర్జునపట్ల),పరమేశ్వరయ్య(గుర్జకుంట), పి.రాజయ్య(ఆకునూరు), ఎం.రామకృష్ణ(కడవేర్గ),కె.తిరుపతిరెడ్డి(చేర్యాల), కె.ప్రభాకర్‌రెడ్డి(వీరన్నపేట), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా టి.వెంకటేశ్వర్లు(పెద్దరాజుపేటపోతిరెడ్డిపల్లి), టి.మనోజ్‌కుమార్(నాగపురి) ఎన్నికయ్యారు.మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీకి ఎన్నికైన వారికి మండల అధ్యక్షుడు కే.వెంకట నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్పాటకం ధర్మారెడ్డి, ప్రతినిధులు ఆకుల వేణు, ఆర్.శ్రీనిఆస్, కె.మమత, ఎస్.అరుణ అభినందనలు తెలిపారు.

మర్కూక్‌లో..

మర్కూక్,అక్టోబర్ 8: పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్‌లో మర్కూక్ పాఠశాలల ఉపాధ్యాయులు ఎన్నికయ్యారని మర్కూక్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. మర్కూక్ మండలం నుంచి కొత్త నరేందర్‌రెడ్డి, కూచిరెడ్డి, (యూపీఎస్ శివారు వెంకటాపూర్) నర్సింహులు, రామకృష్ణారెడ్డి, ఎండీ. షాబొద్దీన్,రజితారెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా,ఉపాధ్యక్షురాలిగా సరితాదేవి, యాదిరెడ్డి, గణేశ్, శ్రీధర్ ఎన్నికయ్యారని తెలిపారు.

సీఐ,ఎస్సైలకు సన్మానం

చేర్యాల, అక్టోబర్ 8 : మండలంలోని ఆకునూరు భవానీ రుద్రేశ్వరిస్వామి ఆలయంలో ఉల్లెంగల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకానందం పద్మ దంపతులు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రత్యేక పూజల్లో మంగళవారం సీఐ శ్రీను, ఎస్సై నీరేశ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారితో పాటు భవాని రుద్రేశ్వరి స్వామి వారిని పోలీస్ అధికారులు దర్శించుకున్నారు.అనంతరం ఉల్లెంగల దంపతులు సీఐ,ఎస్సైలను సన్మానించారు.

కనకదుర్గమ్మ ఆలయానికి విరాళం

చేర్యాల, అక్టోబర్ 8 : పట్టణంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి పట్టణ శివారు కర్షకనగర్‌కు చెందిన పిల్లి శ్రీధర్ రూ.51వేల విరాళాన్ని మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు.కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, కౌన్సిలర్ చెవిటి లింగం, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, యాట యాదగిరి, బండి సుదర్శన్, అవుశర్ల కిశోర్ పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో కొండాపూర్ విద్యార్థి

చిగురు శ్రీకాంత్

మిరుదొడ్డి, అక్టోబర్ 8 : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో కొండాపూర్ గ్రామానికి చెంది విద్యార్థి జిల్లాలో రెండో ర్యాంకు సాధించాడు. మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు నాగలక్ష్మీ పెంటయ్య దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు చిగురు శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో రెండో ర్యాంకు సాధించాడు. జిల్లాలోనే రెండో ర్యాంకు సాధించిన శ్రీకాంత్‌ను గ్రామస్తులు అభినందించారు.

సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 8 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని కృషి చేస్తుంటే భూంపల్లి వైద్యాధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని భూంపల్లి మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకురాలు ఉమారాణి బాలగౌడ్ అన్నారు. మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించిన సమయంలో రోగుల తప్పా...?..అక్కడ డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది ఎవరూ లేక పోవడంతో విస్తుపోయారు.

దౌల్తాబాద్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

రాయపోల్,అక్టోబర్ 8 : దౌల్తాబాద్ మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 99 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే మంగళవారం ఉదయం దౌల్తాబాద్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రధాన విధుల గుండా భారీ ర్యాలీని నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహన్ మూల నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ర్యాలీకి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 8: ప్రమాదవశాత్తు బావిలోపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ధూళిమిట్ట మండలంలోని తోర్నాలలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యాకోజు చంద్రయ్య(75) అనే వృద్ధుడు మతిస్థిమితం లేక గ